క్లుప్తంగా

నేడు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

దౌల్తాబాద్: మండల కేంద్రంలో పెద్ద చెరువు దగ్గర గుట్టల్లో వెలిసిన మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం మంగళవారం జరగనుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ రోజు కురుమలు ఈ వేడుకను వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మల్లికార్జునస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలతో పాటు జల్దిబిందె కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నారు. ఈ ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల భక్తులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.

పోలెపల్లిలో ప్రత్యేక హోమం



అలంకరణలో అమ్మవారు

దుద్యాల్: ప్రసిద్ధిగాంచిన మండల పరిధిలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవాలయంలో ధనుర్మాస పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ వివరించారు.

వెలగని హైమాస్ట్ లైట్లు



తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలోని అన్వర్ హోటల్ వద్ద హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. గతంలో ఎంపీ నిధులతో ఈ లైట్లు ఏర్పాటు చేశారు. దాదాపు రెండు నెలల నుంచి దీపాలు వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించు కోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



ధారూరు: మండల పరిధిలోని కొండాపూర్ ఖుర్దు గ్రామం నుంచి శ్మశానవాటిక వరకు సీసీ రోడ్డు పనులను అధికారులు, స్థానిక నాయకులు సోమవారం ప్రారంభించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు మంజూరైన జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు(రూ.ఐదు లక్షలు)తో పనులు కొనసాగిస్తున్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ



పాల్గొన్న క్రీడాకారులు

యాలాల: మండలంలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో శ్రీ వశిష్ట పాఠశాల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ సోమవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు పోటీ పడ్డాయి. విజేతగా రాంప్రసాద్, నరేందర్ టీం, రన్నరప్‌గా ఆంజనేయులు, వెంకట్‌లు నిలిచారు. బాల్ బ్యాడ్మింటన్‌లో అగ్గనూరుకు చెందిన పిట్టలి శ్రీనివాస్ టీం విన్నర్‌గా, ఉప్పరి నర్సింహులు రన్నర్‌గా నిలిచారు. గెలుపొందిన విజేతలకు పాఠశాల తరఫున ట్రోఫీ, బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, పీఈటీ హరికృష్ణ, పండరీనాథ్, నరేష్, నరేందర్, శ్రీనివాస్, వీరేశం, ఇస్మాయిల్, సర్వర్, వెంకటేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

కొడంగల్ రూరల్: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన ఆశప్ప(కృష్ణయ్య) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. వార్డుకు చెందిన మాఫీ వెంకటయ్య, కర్ణె శ్రీను సైతం మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించారు.

రైతుల చూపు.. వేరుశనగ వైపు

- దౌల్తాబాద్ వ్యాప్తంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- దిగుబడిపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలు



ఈర్లపల్లి శివారులో సాగు చేస్తున్న వేరుశనగ

దౌల్తాబాద్: అన్నదాతలు సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి నూతన ఒరవడిలో సాగుకు సన్నద్ధమవుతున్నారు. మార్కెట్ పరిస్థితులు, మద్దతు ధర తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని పంట మార్పిడి పద్ధతి అవలంబిస్తున్నారు. దానిలో భాగంగా యాసంగిలో రైతులు వేరుశనగ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల రైతులు రెండో పంటగా కొన్నేళ్ల పాటు జొన్న సాగు చేశారు. ఈ ఏడాది మాత్రం వేరుశనగ వైపు ఆసక్తి చూపుతున్నారు. గత రెండు మూడేళ్లుగా వేరుశనగ దిగుబడి సరిగా రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గిట్టుబాటు ధర సైతం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. దీంతో క్రమంగా సాగు తగ్గించారు. గతేడాది నుంచి దిగుబడి పెరగడంతో వేరుశనగ సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. మార్కెట్‌లో సైతం డిమాండ్ ఉండడం, ప్రస్తుతం పంటకు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

800 ఎకరాల్లో సాగు

మండల వ్యాప్తంగా ప్రస్తుతం గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో పైగా పంట సాగులో ఉంది. గతేడాది దాదాపు 500 ఎకరాల్లో సాగు చేశారు. ప్రధానంగా దౌల్తాబాద్, గోకఫసల్వాద్, అంతారం, ఇందాపూర్, యాంకి, దేశాయిపల్లి, ఈర్లపల్లి, శివారుల్లో అధికంగా సాగుచేస్తున్నారు. వేరుశనగ సాగుకు గతేడాది నుంచి అనుకూలంగా వాతావరణం ఉంది. దిగుబడులు సైతం అధికంగా రావడంతో రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం పెట్టుబడులు సైతం తక్కువగా పెట్టామని ఆరుగాలం శ్రమించిన కర్షకులు తెలుపుతున్నారు. పంటకు తెగుళ్ల సోకకుండా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే వేరుశనగ పంట చేతికొచ్చింది. ధర విషయానికొస్తే గతేడాది క్వింటాల్‌కు రూ.6000 నుంచి రూ.6200 వరకు ఉంది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.6800 వరకు పలుకుతుంది.

> **రైతులకు సూచనలిస్తున్నాం**
>
> వేరుశనగ సాగు చేసిన రైతులకు వ్యవసాయ శాఖ తరఫున సాగులో సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పంట దిగుబడి రావడానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సైతం తెలియజేశాం. అయితే గ్రామాల్లో రైతులు వేరుశనగ సాగుకు చాలా మంది ముందుకు వస్తున్నారు. – **లావణ్య, ఏఓ, దౌల్తాబాద్**

కల్వర్టు తెచ్చిన తంటా



పగిడియాలలో ఇళ్ల కంటే ఎత్తులో కల్వర్టు నిర్మాణం

యాలాల: రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న కల్వర్టుతో కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. సమీపంలో ఇళ్ల నిర్మాణాలకు ఎత్తులో కల్వర్టు నిర్మించడంతో వర్షాకాలంలో వరద నీటి ప్రమాదం పొంచి ఉందని మండలంలోని పగిడియాల గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పగిడియాల–రాస్నం ప్రధాన మార్గంలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణాన్ని ఇటీవల పూర్తి చేశారు. గతంలో ఇక్కడ లో లెవెల్ కల్వర్టు ఉండేది. దాన్ని తొలగించి భారీ కల్వర్టును నిర్మించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ కల్వర్టు సమీపంలో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కల్వర్టు ఎత్తు అమాంతం పెంచడంతో ఇళ్ల సముదాయాలు పూర్తిగా గుంతలోకి వెళ్లిపోయాయి. వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల గ్రామస్తులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

చెన్నారెడ్డి సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న సిరిపురం గ్రామస్తులు

మర్పల్లి: మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని సిరిపురం గ్రామస్తులు సోమవారం నివాళులర్పించారు. గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శంకరయ్యగౌడ్, నాయకులు రాజిరెడ్డి, రఘురాంరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఆనందం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



దోమ: బాధితుడికి చెక్కు అందజేస్తున్న నేతలు

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సీఎం సహాయ నిధి కింద రూ.41 వేలు మంజూరు చేయించారు. ఈ మేరకు స్థానిక నేతలు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్నగౌడ్, భాస్కర్‌గౌడ్, సాయిలు, రఘు, విజయ్, రాములు, యాదయ్య, శ్రీను, రమేశ్, నర్సింహులు, ప్రశాంత్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశంతో కలిసి బంట్వారంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, యాదగిరి, రాములుస్వామి, హరీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, వెంకటయ్య, రమేష్, వీరేశం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జల్ది ఉత్సవాలు



జల్ది బిందెలతో వస్తున్న గ్రామస్తులు

దుద్యాల్: మండల కేంద్రంలో వెలిసిన చౌడేశ్వరీమాత జల్ది ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రతి సంవత్సరం సంక్రాంతిని పురస్కరించుకొని ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం , 9 గంటలకు జల్ది బిందెలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు కొనసాగాయి. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

స్వేరోస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఇతరులు

పరిగి: స్వేరోస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర జిల్లా క్యాలెండర్‌ను సోమవారం ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. నగరంలోని స్వేరో కార్యాలయంలో జిల్లా నాయకులతో కలిసి క్యాలెండర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆర్‌ఎస్ మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పూలే, సావిత్రిబాయి, అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ప్రజలు, యువత జ్ఞానం వైపు అడుగులు వేసే విధంగా తయారు చేయడమే స్వేరోస్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్నాపూర్ శ్రీనివాస్, నాయకులు వీరయ్య, కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు సన్మానం



అనంతగిరి: ఆర్‌టీఏ మెంబర్‌గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్‌ను సోమవారం వికారాబాద్ జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పూలబొకే అందించి శాలువాతో సత్కరించారు. జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు ఫయాజ్ మాట్లాడుతూ.. ఆర్‌టీఏ మెంబర్‌గా నియమితులైన జాఫర్ ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు అబ్దుల రావూఫ్, జాకీర్, రఫీయోద్దీన్, హబీబ్ ఉర్‌రహ్మాన్, మాజిద్, సైఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేడికవర్ ఆస్పత్రి డాక్టర్ అచ్యుత్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 310 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సంప్రదాయాలను ప్రోత్సహించాలి

తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి

తాండూరు రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించడం అభినందనీయమని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో గ్రామస్తులు, యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముగ్గుల పోటీలు నిర్వహించడంపై గ్రామస్తులను అభినందించారు. పోటీల్లో గెలుపొందిన సంగీత, శిరీష, వడ్ల శ్రీవాణిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేందర్, కిరణ్, మున్నా, మహేష్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న వరి నాట్లు



మంబాపూర్‌లో వరినారు తీసుకెళ్తున్న కూలీలు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. పల్లెల్లో చెరువులు, ప్రాజెక్టులతో పాటు బోరు మోటార్ల కింద రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. సోమవారం మంబాపూర్ గ్రామ శివారులోని ఓ పొలంలో మహిళలు వరినాట్లు వేస్తున్నారు. ఓ పక్క భోగి పండుగ చేసుకొని అనంతరం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. జానపద పాటలు పాడుకుంటూ శ్రమను తెలియకుండా ఆనందంగా గడిపారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



కుల్కచర్ల: ఎమ్మార్పీఎస్ కుల్కచర్ల మండల నూతన అధ్యక్షుడిగా కొమ్ము శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానికంగా జిల్లా నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా మొగులయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులుగా యాదయ్య, రాజు, వై.బాబు, కోశాధికారిగా హన్మంతు, బాలకృష్ణ, రాములు, పి.బాబు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాదిగల హక్కుల పరిరక్షణకు సంఘం ఆధ్వర్యంలో నిర్విరామంగా కృషిచేస్తామని పేర్కొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

మొయినాబాద్‌రూరల్: బీజేపీ మొయినాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా ముర్తుజాగూడ గ్రామానికి చెందిన మాదాపురం శ్రీకాంత్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేపీ జిల్లా రిటర్నింగ్ అధికారి అశోక్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీజేపీలో గత పది సంవత్సరాల నుంచి పనిచేస్తున్నట్లు తెలిపారు. బూత్ అధ్యక్షులుగా, మండల బీజేవైఎం అధ్యక్షులుగా పనిచేసి పార్టీలో కీలకమైన అనుభవం ఉందని తెలిపారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి మండల అధ్యక్షుడిగా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజాప్రతినిధులు గెలుపొందేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

చేవెళ్ల అధ్యక్షుడిగా అనంతరెడ్డి

చేవెళ్ల: బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడిగా అత్తెల్లి అనంతరెడ్డి నియామకమయ్యారు. చేవెళ్లకు చెందిన అనంతరెడ్డి ఇప్పటివరకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సోమవారం జిల్లా అధిష్టానం ఆయన సేవలను గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మల్కాపూర్ గ్రామానికి చెందిన దేవుని శర్వలింగం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు.

షాబాద్ అధ్యక్షుడిగా మద్దూరు మాణెయ్య

షాబాద్: బీజేపీ షాబాద్ మండల అధ్యక్షుడిగా మాద్దూరు మాణెయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి సోమవారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ సత్తాచాటుందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కుల్కచర్ల: పుర్సంపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నేతలు



దౌల్తాబాద్: క్రికెట్ కిట్లు అందజేస్తున్న నాయకులు

దోమ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడడమే కాకుండా స్నేహభావాన్ని పెంచుతాయని ఐనాపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు విజయాంజనేయులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ఇటీవల గ్రామానికి చెందిన కృష్ణ అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్మారకార్థం క్రికెట్ టోర్నీని గ్రామ యువకులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజుకుమార్, ఆనంద్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, భీమేష్, వెంకటయ్య, దిలీప్‌కుమార్, గోపాల్, మహేశ్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కుల్కచర్ల: చౌడాపూర్ మండల పరిధిలోని పుర్సంపల్లి గ్రామంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎర్రం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. యువత క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంతో ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిట్ల పంపిణీ

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని క్రీడాకారులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి క్రీడాకారులు కిట్లు అందజేయాలని కోరారు. అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు 6 జట్లకుగాను కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న, దస్తప్ప, మహిపాల్, కృష్ణ, శేఖర్, అంజి తదితరులు పాల్గొన్నారు

కల్యాణం

కొత్తూరు: పెంజర్లలో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో మంగళవారం కల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తెలిపారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం గిరిప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవంగా కొనసాగింది. హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పౌర్ణమికి నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా విచ్చేసి పాంబండ క్షేత్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయించారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పౌర్ణమిని పురస్కరించుకుని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సోమవారం పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామికి ప్రత్యేకంగా అభిషేకాన్ని నిర్వహించి పూజలు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ గణేశ్



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చేవెళ్ల: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌జార్జి సీఐ గణేశ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం చేవెళ్లలో వాహనదారులు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు సిగ్నల్స్‌ను చూసుకొని వెళ్లాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన శిక్షలు, చలాన్లు ఉంటాయన్నారు. ట్రాఫిక్ ఏఎస్సై చందర్‌నాయక్, అశోక్ తదితరులు ఉన్నారు.